శ్రీగిరిపై ముగిసిన బ్రహ్మోత్సవాలు

- అశ్వ వాహనంపై విహరించిన ఆది దంపతులు
- చివరి రోజున పుష్పోత్సవం, శయనోత్సవం


శ్రీశైల మల్లికార్జునస్వామి, అమ్మవారికి పుష్పయాగోత్సవం

శ్రీశైలం, మార్చి 11: శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 1న ప్రారంభమైన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పంచాహ్నిక దీక్షతో 11 రోజులు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ వాహనంపై ఆసీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు జరిపారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, శంఖు, ఢమరుక నాదాలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, ఉభయదేవాలయాల అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పుష్పోత్సవం: ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం జరిపారు. కాగడాలు, పసుపు బంతి, పసుపు చేమంతి, తెల్ల చేమంతి, నీలం చేమంతి, నందివర్ధనం, గరుడ వర్ధనం, మందారం, ఎర్ర ఆస్టర్, నీలం ఆస్టర్, మల్లెలు మొదలైన 21 రకాల పుష్పాలను విశేషంగా స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ఏకాంత సేవ చేసి శయనోత్సవం నిర్వహించారు.


డోలు, నాదస్వర వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ

● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సోమవారం హరికథ, భక్తి రంజని కార్యక్రమాలను నిర్వహించింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారులు అద్భుత ప్రదర్శనతో భక్తులను ఎంతగానో అలరించారు.



అశ్వవాహనంపై దర్శనమిస్తున్న శ్రీశైల మల్లేశుడు

గత ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా అట్టడుగున పడిపోయింది. అప్పుడు విద్యాశాఖాధికారుల తీరు మీద బోలెడు విమర్శలు వచ్చాయి. పిల్లలకు చదువు చెప్పడానికి ఉపాధ్యాయులకు అవకాశమే లేని పాలనా విధానాల మీద అసంతృప్తులు వినిపించాయి. దీన్నుంచి ఈ విద్యా సంవత్సరం ఏమన్నా మెరుగ్గా అధికారులు పని చేశారా? అంటే లేదనే చెప్పాలి. విద్యార్థులకు అదనపు తరగతులు పెట్టడం మినహా చేసిందేమీ లేదు. ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించలేదు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు మోటివేషన్ క్లాసులు జరపాలని అనుకోలేదు. పైగా యాప్‌ల ఒత్తిడిలోపడి ఉపాధ్యాయులు విద్యార్థులకు తగినంత సమయం కేటాయించడం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. ఇవన్నీ కలిసి కిందటేడాది మాదిరే.. ఈ సారి పది ఫలితాలు ఉంటాయా? అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 18 నుంచి పది పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇన్ని సందేహాలు చుట్టుముడుతున్నాయి.



ఈ సారి పది పడకేసినట్లేనా?

- గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా చివరి స్థానం
- ఈసారి కూడా చదువు అంతంత మాత్రమే
- యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు సతమతం
- విద్యార్థులకు సమయం కేటాయించే తీరికే లేదు
- ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించని అధికారులు

నంద్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 30 వేలకు పైగా విద్యార్థులు ఈ నెల 18 నుంచి పరీక్షలకు హాజరు కాబోతున్నారు. విద్యార్థులను పరీక్షలకు అన్ని రకాలుగా సిద్ధం చేశామని అధికారులు భరోసాతో చెబుతున్నారు. గతేడాది అనుభవాల దృష్ట్యా ఫలితాల పెంపునకు అధికారులు ఏమైనా ప్రత్యేక శ్రద్ధ వహించారా? అనే ప్రశ్నకు మాత్రం సరైన సమాధానం రావడం లేదు. కరోనా రెండేళ్ల కాలంలో తరగతులు జరగలేదు కాబట్టి విద్యార్థుల విద్యా ప్రమాణాలు తగ్గాయని, అప్పటి విద్యార్థులు గతేడాది పది పరీక్షలకు హాజరయ్యారని, అందువల్ల ఫలితాలు పడిపోయాయని అధికారులు సమర్థించుకున్నారు. పైగా గతేడాది పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడం వల్ల కూడా ఫలితాల్లో జిల్లా చివరి స్థానంలో నిలిచిందని చెప్పుకున్నారు. అయితే ఇక్కడే అందరిలో ఓ అనుమానం రేకెత్తుతోంది. విద్యార్థులను పరీక్షలకు తగిన పద్ధతిలో సిద్ధం చేశారా? ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేశారా? ప్రతిభను తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన నిర్వహించారా? అనే ప్రశ్నలు ఉన్నాయి. ఇవేవీ చేయకుండా పరీక్షలను కట్టుదిట్టంగా జరపడం వల్ల ఫలితాలు పడిపోయాయనే వాదిస్తే అందులో పస ఉండదు. విద్యార్థులను పరీక్షలకు శాస్త్రీయంగా సిద్ధం చేయాలి, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి..ఈ రెండూ సక్రమంగా చేస్తూ మంచి ఫలితాలు సాధించాలి. ఈ దిశగా విద్యాశాఖ విద్యార్థులకు అదనపు క్లాసులు నిర్వహించడం తప్ప చేసిందేమీ లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. గతేడాది విద్యార్థులు ఎక్కువగా లెక్కలు, సైన్స్ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు తెలుస్తోంది. ఈ సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రమాణాలు పెంచడానికి ఈసారి ఏం చేశారన్న ప్రశ్నకు విద్యాశాఖ అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. పైగా ఉపాధ్యాయులను భర్తీ చేశామని వింత సమర్థన ఇచ్చారు.

ఇలాంటి పరిస్థితిలో ఈసారి కూడా పది ఫలితాలు గొప్పగా ఏమీ ఉండకపోవచ్చనే సందేహాలు వినిపిస్తున్నాయి.

● సమయమంతా వాటికే..

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధ్యాయులు చదువు చెప్పడం కంటే మిగతా పనులకే సమయం ఎక్కువ కేటాయించాల్సి వస్తోంది. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు కోసం యాప్‌లను ఉపయోగిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో, నెట్‌వర్కులు సరిగా లేని చోట్ల ఈ యాప్‌లను ఉపయోగించడం వల్ల సమయం అంతా హరించుకుపోతోంది. ఇక ప్రధానోపాధ్యాయులకైతే ఈ యాప్ కష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. శ్రద్ధ వహించి విద్యార్థులను మెరికల్లాగా తీర్చిదిద్దడంలో విఫలమవుతున్నారన్న విమర్శ ఉపాధ్యాయ సంఘాల నుంచి కూడా వస్తోంది. ప్రభుత్వం ఉపాధ్యాయులపై పనిభారం పెంచడం, మరోవైపు జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు సరైన శిక్షణ ఇవ్వడంలో విఫలమవుతుండం వల్ల ఈసారి కూడా పది ఫలితాలు మెరుగ్గా ఏమీ ఉండకపోవచ్చనే అంచనాలు ఉన్నాయి.

● ఎందుకీ అబద్ధపు ప్రచారం..

తమ ప్రభుత్వం వచ్చాక జిల్లాలో విద్యార్థుల పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందన్న రీతిలో వైసీపీ నాయకులు అతిశయోక్తులు చెబుతున్నారు. వారి మాటలకు విద్యాశాఖ అధికారులు తందాన అంటున్నారు. కిందిస్థాయి వారే అలా ఉంటే తాను ఇంకో అడుగు ముందుగా ఉండాలని అనుకున్నాడో ఏమో డీఈవో సుధాకర్‌రెడ్డి గతేడాది పది ఫలితాల్లో నంద్యాల జిల్లా మూడో స్థానంలో ఉందని, ఈసారి మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని వైసీపీ అనుకూల పత్రికకు గత నెల 26న ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించాడు. కిందటేడాది పది ఫలితాల్లో చివరి స్థానంలో నిలవడంతో జిల్లా పరువు పోయినట్లయింది కాబట్టి మొదటి స్థానంలో నిలపుతాననడం వరకు బాగానే ఉంది. కానీ గతేడాది మూడో స్థానంలో నిలిచిందని అబద్ధం చెప్పడం ఎందుకు? ఎవరిని మభ్యపెట్టేందుకు ఇలా ప్రచా రం చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడితున్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే గతేడాది ఫలితాలకు సంబంధించిన వాస్తవాన్ని ఒప్పుకుంటూ, ఈ సంవత్సరం ఏ స్థాయిలో ఫలితాలు సాధిస్తారో చెప్పాలి. అంతేగాని ఇలా అబద్ధపు ప్రకటనలతో సాధించేదేమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.





● ఉపాధ్యాయులకు శిక్షణేదీ..?

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడానికి చాలా కసరత్తు చేయాలి. విద్యార్థులను మెరికల్లాగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులకు కూడా ఓరియంటేషన్ శిక్షణా తరగతులు నిర్వహించాలి. ప్రమాణాలను బట్టి విద్యార్థులను టాపర్స్, ఫస్ట్ క్లాస్, యావరేజి, చదవలేని వారిని గుర్తించి వారికి ఎలాంటి శిక్షణ ఇస్తే పరీక్షల్లో నెగ్గుకు రాగలుగుతారో గ్రహించి చదువు చెప్పేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి. అయితే కరోనా తర్వాత అలాంటి శిక్షణ ఏమీ ఇవ్వలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సహజంగానే పరీక్షలంటే చక్కగా చదివే విద్యార్థులు కూడా ఆందోళనకు లోనవుతారు. వీరి వత్తిడిని దూరం చేసి, వారిలో మానసిక ధైర్యం నింపేలా మోటివేషన్ తరగతులు నిర్వహించా లి. ఈ కోణంలో ఉపాధ్యాయులే ఏదో రకంగా చెప్పడం తప్పించి విద్యాశాఖ నుంచి కనీస చర్యలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటివి ఏమీ చేయకుండా విద్యార్థులన పాస్ చేయించే బాధ్యత ఉపాధ్యాయులదేనన్న రీతిలో వ్యవహరించడం విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోంది.

నేత్రానందం.. తెప్పోత్సవం

- రుద్రగుండం పుష్కరిణిలో విహరించిన మహానందీశ్వరుడు


స్వామివారి తెప్పోత్సవం

మహానంది, మార్చి 11: మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా సాగింది. ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం పుష్కరిణిలో జరిగిన తెప్పోత్సవంపై మహానందీశ్వర స్వామి, కామేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్ర పరిధిలోని రుద్రగుండం పుష్కరిణిలో అందంగా పూలతో తీర్చిదిద్దిన తెప్పపై స్వామి, అమ్మవార్లు విహరించారు. వేదపండితులు పూజలు జరిపిన అనంతరం పుష్కరిణిలో తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. దాదాపు గంటపాటు సాగిన తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, సుధారాణి దంపతులతో పాటు దాతలు అవ్వారు గౌరినాథ్, లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ పాల్గొన్నారు.

యాగంటిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె, మార్చి 11: మండలంలోని యాగంటి క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు 5వ రోజున సోమవారం ముగిశాయి. నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డితోపాటు ఆలయ పాలకవర్గ సభ్యులతో పాటు ఆలయ పూజారులు పాల్గొన్నారు. దీంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు యాగంటి క్షేత్రంలో ముగిశాయి.


ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న పూజారులు, పాలకవర్గ సభ్యులు

జగన్ ఇక ఇంటికే..

- వైసీపీ పాలనలో హత్యలు, మాఫియాలే
- బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్ ధ్వజం



కర్నూలు(అర్బన్), మార్చి 11: మేదరమెట్ల సిద్ధం సభను చూస్తుంటే జగన్ ఇక ఇంటికేనని స్పష్టమవుతోందని అన్నారు. టీడీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్ గౌడ్‌లు సోమవారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జగన రెడ్డి పాలనలో కోడి కత్తి డ్రామాలు, బాబాయి హత్య, అసాంఘిక కార్యకలాపాలు, మైనింగ్, లిక్కర్ మాఫియాలు తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. మేదరమెట్ల సిద్ధం సభలో మాట్లాడిన తీరును జగన్ వెన్నులో వణుకు పుట్టిందని అర్థమవుతోందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి గురించి ఏ గ్రామానికి వెళ్లినా కనిపిస్తుందని అన్నారు. జగన్‌రెడ్డి మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు అధికారమిచ్చారని, నిరంకుశ, అప్రజాస్వామిక పాలనను చూసి చరమగీతం పాడాలని ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని హెచ్చరించారు. వేలాది రూపాయలు ఇచ్చి మందు, బిర్యాణి సరఫరా చేసి జనాన్ని సిద్ధం సభకు తరలించారని ఆరోపించారు. సకల శాఖ అనుచరుడు సజ్జల పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయంలో గురువైభవం

- ప్రారంభమైన రాఘవేంద్ర స్వామి ఉత్సవాలు
- ప్రముఖులకు అవార్డులు అందజేసిన పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 11: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో శ్రీరాఘవేందస్వామి గురువైభవోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్యోతిప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. మొదటి రోజే వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఉత్సవాలకు తరలివచ్చారు. ఉదయం నుంచి రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. యోగీంద్ర కళా మండపంలో రాఘవేంద్రస్వామి విగ్రహానికి జ్యోతి ప్రజ్వలనచేసి ఉత్సవాలకు నాంది పలికారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులకు పాదపూజ చేసి చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఊరేగించారు.

గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో రాయచూరు జిల్లా ఎస్పీ నిఖిల్, బెంగుళూరు కర్ణాటక సంస్కృత యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ధరణప్పకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు గురువైభవోత్సవ- 2024 అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, వాదిరాజాచార్, ఈఈ సురేష్ కోణాపూర్, ఏఈ బద్రినాథ్, అనంతపురాజిక్, రవికులకర్ణి, విజయేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.


రాయచూరు జిల్లా ఎస్పీ నిఖిల్‌కు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



వేడుకల్లో కళాకారులు



ఇస్లాంలో నాలుగో మూలస్తంభం ఉపవాసం. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతం ఉపవాసం. ఎదుటివారి ఆకలి విలువను గుర్తించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఉపవాసాన్ని అరబ్బీ భాషల్ 'సౌమ్'గాను, ఉర్దూలో 'రోజా'గా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెల అయిన రంజాన్‌లో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సౌమ్(రోజా) అంటే ఆగి ఉండటం. అంటే సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ తినడానికి.. తాగడానికి.. మనో వాంఛలకు దూరంగా ఉండమని అర్థం. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం సోమవారం నెలవంక దర్శనంతో మంగళవారం నుంచి ప్రారంభం కానుంది.

పవిత్ర మాసం రంజాన్

- నేటి నుంచి కఠోర ఉపవాస దీక్షలు
- నెలవంక దర్శనంతో సిద్ధమైన ముస్లింలు
- ముస్తాబైన మసీదులు

కర్నూలు (కల్చరల్), మార్చి 11: ఇస్లామిక్ క్యాలెండర్‌లో వచ్చే రంజాన్ మాసానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ మాసంలో ముస్లింలు ఆధ్యాత్మిక భావనలతో, ధార్మిక చింతనలతో గడుపుతారు. మానవుడు సామాజికంగా ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో రంజాన్ మాసం బోధిస్తుంది. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ముస్లింలు నిత్యం నమాజులతో, ఖురాన్ గ్రంథం పఠనంతో, పద్నాలుగు గంటల పాటు ఉపవాసం పాటిస్తూ ఉంటారు. అంతేకాదు, ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దానిలో కొంత భాగం పేదలకు ఖర్చుచేయాలని కూడా ఈ మాసం ఉద్బోధిస్తుంది. అందుకే ప్రతి ముస్లిం రంజాన్ మాసం ఆరంభం కోసం నెలవంకవైపు ఆశగా చూస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో రంజాన్ సందడి గత రెండు రోజుల ముందే కానవచ్చింది. రోజా దీక్షలు పాటించే వారికి సాయంత్రం దీక్షల ముగింపు ఉపాహారంగా నిలిచే హలీమ్ కేంద్రాలు, పండ్లు, ఫలాహార కేంద్రాలు వివిధ ప్రాంతాల్లో వెలిశాయి. రంజాన్ మాసంలో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ ముస్లింలు ఎలాంటి ఆహారం కనీసం నీళ్లు కూడా తాగకుండా కఠోర దీక్ష పాటిస్తారు. ఇందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. రోజా, నమాజ్, జికర్, దువాలతో గడపనున్నారు. సెహరీ, ఇఫ్తార్ విందులతో సందడి చేయనున్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మసీదులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యికి పైగా మసీదులు ఉండగా, ఒక్క కర్నూలు నగరంలో 200 వరకు మసీదులు ఉన్నాయి. రంజాన్ సందర్భంగా వివిధ మసీదులను ప్రత్యేక నమాజులకు సిద్ధం చేశారు. నిత్యం ఐదు పూటలా నమాజులతోపాటూ ప్రత్యేక ఈద్ నమాజ్‌లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆయా మసీదుల కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

● రోజా నియమాలు...ప్రాముఖ్యం

ఇస్లాం సౌధానికి ఉండే మూల స్తంభాల్లో రంజాన్ ఉపవాస వ్రతాలు ఒకటి. ఉపవాసం పాటిస్తున్నప్పుడు వాటి బాహ్య నియమాలతోపాటు, అంతర్ నియమాలు కూడా తప్పకుండా పాటించాలి. అబద్ధాలు చెప్పడం, చాడీలు చెప్పడం, దూషించడం, పరోక్షంగా నిందించడం, దురుసుగా మాట్లాడటం, అశ్లీల మాటలు పలుకడం, పోట్లాటకు దిగడం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఈ భావనలు జీవితాంతం అనుసరించాలి. ప్రతిరోజూ ఐదు పూటల నమాజ్‌తో అదనంగా రాత్రి ఇషా నమాజ్ ఆ తర్వాత 20 రకాల తరావీహ్ నమాజులు ఆచరించాలి.

● 'దివ్య ఖురాన్' అవతరించిన నెల

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించి, సదా ఆచరించే దివ్యఖురాన్ రంజాన్ నెలలోనే అవతరించింది. ఇతర ప్రవక్తలపై ఫర్మానులు సైతం ఇదే నెలలో అవతరించాయి. అందుకే ఈ నెలకు అంతటి ప్రాధాన్యం. ఈ సమయంలో సైతాను బంధీ అవుతాడని, నరకద్వారాలు మూతపడి, స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయన్నది ముస్లింల ప్రగాఢ విశ్వాసం. రోజా ఆచరించే 30 రోజుల్లో మొదటి పది రోజులను ముస్లింలు కారుణ్య దినాలుగా నమ్ముతారు. 10 నుంచి 20 రోజులు క్షమాపణ రోజులు, 20 నుంచి 30వ రోజువరకు నరకాగ్ని నుంచి విముక్తి దినాలుగా ముస్లింలు విశ్వసిస్తారు. రోజా పాటించడంలో కొందరికి మినహాయింపు ఉంటుంది. చిన్నపిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వయో వృద్ధులు, మతిస్థిమితం లేనివారు, అశుద్ధావస్థలో ఉన్న మహిళలకు ఉపవాసం నుంచి మినహాయింపు ఉంటుంది.



నంద్యాల జిల్లా చాగలమర్రిలో ముస్తాబైన 500 ఏళ్ల చరిత్రగల అరబ్ మసీదు

టీచర్ సస్పెన్షన్‌పై విచారణ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం కోయిలకుంట్ల మండలం రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచరుగా పని చేస్తున్న కె.సతీష్ కుమార్ సస్పెన్షన్‌పై విచారణ జరిగింది. ఏపీ లైబ్రరీ డైరెక్టర్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఈ విచారణ నిర్వహించారు. ఈ విచారణకు పూర్వపు ఆర్జేడీ వెంకట క్రిష్ణారెడ్డి, రిటైర్డు డీఈవో రంగారెడ్డి, నంద్యాల ఉప విద్యాశాఖ అధికారి బేగ్, ఎంఈవోలు బ్రహ్మం, శ్రీనివాసులతో పాటు కె.సతీష్ కుమార్ విచారణకు హాజరయ్యారు. విచారణలో బీటీఎఫ్ నాయకులు జగదీష్, వెంకటస్వామి, శంకర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జడ్పీ స్టాండింగ్ సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 11: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశభవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 నుండి 12 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుండి ఒంటి గంట వరకు 5వ స్థాయి సంఘం, మధ్యాహ్నం ఒంటి గంట నుండి 2 గంటల వరకు 4వస్థాయి సంఘం, 2:30 గంటల నుండి 3:30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, 3:30 గంటల నుండి 4:30 గంటల వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షకు 665 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సోమవారం జరిగిన పరీక్షకు 665 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 19,145 మంది ఉన్నారు. ఇందులో 18,480 మంది పరీక్షకు హాజరు కాగా, 665 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్‌పాషా, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి.

రాక్షస పాలనను అంతమొందించాలి

● టీడీపీ శ్రేణులకు గౌరు చరిత పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు చరిత

పాణ్యం, మార్చి 11: జగన్ రాక్షస పాలనను అంతమొందించడమే ధ్యేయంగా పనిచేయాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యం టీడీపీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీని ఓడించి రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని వదిలించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఇందుకోసం మండలంలోని ప్రతిగ్రామంలో శంఖారావం పేరుతో టీడీపీ చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. జగన్ పాలనలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌పై బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. బీసీల ఆదరణ పథకాన్ని మరింత ముందుకు నడిపిస్తామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పట్టాల పంపిణీతో పేదలను మోసం చేస్తున్నాడన్నారు. కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గౌరు చరిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరామిరెడ్డి, రామ్మోహన్ నాయుడు, భాస్కరరెడ్డి, రంగరమేష్, నారాయణమ్మ, రమణమూర్తి, జనసేన నాయకులు జగదీశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 11: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల నిర్వహణ అంశాలపై మీడియా ప్రతినిధులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ జి.సృజన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధానాలు, నియమాలపై రిటర్నింగ్ అధికారులతో పాటు పొలిటికల్ పార్టీలు, మీడియా ప్రతినిధులకు స్పష్టత ఉండాలన్న ఉద్దేశంతో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీ, ఎన్నికల నోటిఫికేషన్ తేదీ వేర్వేరుగా ఉంటుందన్నారు. నోటిఫికేషన్ తేదీ నుంచి నామినేషన్లు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ తేదీన ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్‌ను పబ్లిష్ చేయడం జరుగుతుందని, ఆ వెంటనే నామినేషన్లు వేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఓటర్లను మతపరంగా కానీ, కులాల పరంగా, ఓట్లు అడిగినా ఇతర అభ్యర్థుల ప్రచారానికి భంగం కలిగించిన ఎంసీసీ నియమాల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. వాహనాలను తనిఖీ సమయంలో ఏ వాహనంలోనైనా రూ.50వేలకు మించి డబ్బులు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి మీడియా నోడల్ అధికారి వెంకటలక్ష్మమ్మ, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రాఘవేంద్ర స్వామి 403వ పట్టాభిషేక మహోత్సవం

మంత్రాలయం, మార్చి 11: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభోత్సావాల్లో ప్రాముఖ్యమైన రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషకం మంగళవారం వైభవంగా జరగనుంది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేతుల మీదుగా బంగారు సింహాసనంపై రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను అధిష్టించి, బంగారు, వెండి, ముత్యాలు, నాణ్యాలు, వివిధ రకాల పుష్పాలతో అభిషేకించి బంగారు రథంపై ఊరేగించనున్నారు. ఈ విశిష్టమైన రోజును పురస్కరించుకుని దేశ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.



బంగారు పాదుకలకు తలపై పెట్టుకున్న పీఠాధిపతి

కూలీలపై దూసుకెళ్లిన రైలు

● ఇద్దరి మృతి ● ఒకరికి తీవ్ర గాయాలు



ఓబులేసు (ఫైల్)



బోయ కిష్టన్న (ఫైల్)



ప్రమాదంపై విచారణ చేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మద్దికెర/తుగ్గలి, మార్చి 11: రైల్వే కూలీలపై రైలు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన బోయ కిష్టన్న (64), ఓబులేసు (42) కొప్పుల కాశీతో పాటు మరి కొంత మంది కూలీలు మద్దికెర, తుగ్గలి మార్గమధ్యలో రైల్వేట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్నారు. మొదటి లైనులో గూడ్స్ రాగా కూలీలు రెండో ట్రాక్‌పైకి వెళ్లారు. అయితే అదే సమయంలో రెండో లైనులో గుంతకల్లు నుంచి డోన్‌కు వెళ్తున్న రైలు (07288) వచ్చింది. గూడ్స్ శబ్దం కారణంగా రైలును కూలీలు గమనించలేకపోయారు. దీంతో కిష్టన్న, ఓబులేసులపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో కూలీ కాశీకి కాలు విరిగిపోవడంతో కర్నూలుకు తరలించారు. రైల్వే ట్రాక్‌పై మరమ్మతులు చేస్తున్న సమయంలో అక్కడ రైల్వే ఉద్యోగులు ఎవరూ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుల బంధువులు, ఆరోపిస్తున్నారు. కిష్టన్నకు కుమారుడు ఓబులేసు, కుమార్తె సువర్ణలు ఉన్నారు. కిష్టన్న భార్య శివమ్మ ఇటీవలే మృతి చెందింది. ఓబులేసుకు భార్య లక్ష్మీదేవితోపాటు కూతుర్లు శేకమ్మ, రాణెమ్మ, కుమారులు నరసింహులు ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ, వైసీపీ నాయకులు తిరుపాల్‌నాయుడు నాగభూషణంరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ మురళీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. విచారణ చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లుకు తరలించారు. బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

మంత్రి బుగ్గన అవినీతి చిట్టా విప్పుతా

- కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
- వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 11: ఐదేళ్ల కాలంలో మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని బుగ్గన చేసిన అవినీతి చిట్టాను త్వరలో ప్రజల ముందు ఉంచుతామని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి పెద్దఎత్తున చేరారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన డబ్బు అహంకారంతో మాట్లాడుతుండటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కోట్ల కుటుంబానికి డబ్బులు లేకపోవచ్చు గానీ.. ప్రజలే తమకు బలం అన్నారు. మంత్రి అభివృద్ధి అంతా కాంట్రాక్టర్ల కోసమే జరిగిందని, ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అధికారం అడ్డం పెట్టుకుని రూ.వేల కోట్లు సంపాదించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దమ్ము ధైర్యం ఉంటే... తనను రాజకీయంగా ఎదుర్కోవాలని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఖబడ్దార్ అని కోట్ల హెచ్చరించారు. డోన్ నియోజకవర్గంలో ఇంత మంది కడుపు కొట్టి మైనింగ్ వ్యాపారాలు లాక్కోవడం వాస్తవం కాదాని నిలదీశారు. డోన్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరడం ఆరంభం మాత్రమేనని, ముందుందు వైసీపీ జెండా పీకేయడం ఖాయమన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటంతో వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని అన్నారు. అందరం కష్టపడి పని చేసి డోన్ నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబు శపథాన్ని నెరవేర్దామని కోట్ల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, రంజిత్ కిరణ్, మర్రి మణి, ఈశ్వరయ్య, జయరాముడు, ఎల్ల గౌడు, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

● టీడీపీలోకి భారీగా చేరికలు: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. వైసీపీ నాయకుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రగుంట్లపల్లి, కలచట్ల గ్రామాల నుంచి వంద కుటుంబాలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో వైసీపీకి ఆ గ్రామాల్లో కోలుకోలేని దెబ్బ తగిలింది. అదేవిధంగా డోన్ మండలంలోని డి.రామదుర్గం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సాంబశివుడు, లక్ష్మీనారాయణ, లక్ష్మన్న, రామలింగడు, లింగన్న, నాగేశ్వర, కోటి లింగడు, సుంకన్న, రామాంజనేయులు, ధనుంజయతోపాటు మరో 40 మంది కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

జిల్లా జైలు తనిఖీ



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్), మార్చి 11: పంచలింగాలలోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. ఖైదీల గదులు, జైలు రికార్డులు, ఖైదీలకు అందిస్తున్న మెనూను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీల మిలాఖత్‌ల కోసం వచ్చే సందర్శకుల అవసరార్థం తాగునీటి చలివేంద్రాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. ఖైదీలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర ప్రవృత్తిని వీడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని, ఖైదీలకు అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని తాము అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ ఎం.వెంకటహరినాథ్, చీఫ్ డిఫెన్స్ లీగల్ ఎయిర్ కౌన్సిల్ ఎస్.మనోహర్, ప్రొబెషన్ ఆఫీసర్ దివాకర్, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఘనే నాయక్, మెడికల్ ఆఫీసర్ ఆర్.జగదీష్, జైలర్ జి.ఎరికినాయుడు, డిప్యూటీ జైలర్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వామ్మో వాము

- భారీగా పెరిగిన ధర
- క్వింటా గరిష్ఠ ధర రూ.32,011



యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన వాము

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 11: కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున రైతులు వామును విక్రయానికి తీసుకొస్తున్నారు. సోమవారం 658 క్వింటాళ్ల వాము కర్నూలు యార్డుకు విక్రయానికి వచ్చింది. గరిష్ఠ ధర క్వింటాకు రూ.32,011 పలకగా, మధ్యస్థ ధర రూ.18,060, కనిష్ఠ ధర రూ.10,111కు అమ్ముడుపోయింది. వేరుశనగ కాయలకు ధర నేల చూపే చూస్తుంది. గరిష్ఠ ధర రూ.7,029, మధ్యస్థ ధర రూ.6,069లు, కనిష్ఠ ధర రూ.3,519లకు అమ్ముడుపోయింది. ఆముదాలకు లభిస్తున్న ధరతో రైతులు కొంత ఊరట చెందుతున్నారు. గరిష్ఠ ధర రూ.5,445లు, మధ్యస్థ ధర రూ.5,379లు, కనిష్ఠ ధర రూ.5,089లకు అమ్ముడుపోయినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. కందులకు గరిష్ఠ ధర రూ.9,739లు, మధ్యస్థ ధర రూ.7,879లు, కనిష్ఠ ధర రూ.2,702లకు అమ్ముడుపోయింది. శనగలకు గరిష్ఠ ధర రూ.6,359లు, మధ్యస్థ ధర రూ.5,889లు, కనిష్ఠ ధర రూ.2,100లకు చేరింది. ఉల్లిగడ్డలకు క్వింటాకు రూ.1,669లు, మధ్యస్థ ధర రూ.1,559లు, కనిష్ఠ ధర రూ.306లకు అమ్ముడుపోయింది. ఎండుమిరపకు గరిష్ఠంగా రూ.17,011లు, మధ్యస్థ ధర రూ.13,199లు, కనిష్ఠం రూ.999లకు పలికింది.

ఐఐఐటీడీఎంలో రోబోల వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పూణే డీఆర్‌డీవో శాస్త్రవేత్త కిరణ్ అఖెల

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: స్థానిక ఐఐఐటీడీఎంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో రోబోల ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీపై వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపు 17వ తేదీ వరకు కొనసాగుతుంది. పూణె డీఆర్‌డీవో కిరణ్ ఆఖేల్లాలు, డైరెక్టర్ సోమయాజులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంస్థకు యాక్సిలరేట్ విజ్ఞాన్ కార్యశాల పథకం కింద భారత ప్రభుత్వం సైన్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు ఆర్థిక సహకారంతో కొనసాగుతుందన్నారు. ఇందులో 25 మందికి రూ.5 లక్షల రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్సీ రంగాలలో పరిశోధన చేస్తున్న విద్యార్థులకు వర్క్‌షాపు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త డా.రవికుమార్, దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల నుంచి ప్రముఖులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: జిల్లాలోని 26 కేజీబీవీలలో 6వ తరగతిలో చేరేందుకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ విజయ జ్యోతి కుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడిబయట చిన్నారులు, డ్రాపవుట్లు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో పారదర్శక పరిశీలన అనంతరం ఎంపికైన వారి ఫోన్ నెంబర్లకు మెసేజీ రూపంలో సమాచారం అందుతుందని తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి గానూ ప్రతి కేజీబీవీలో 40 సీట్లు కేటాయించామని చెప్పారు. జిల్లాలో మొత్తం 26 కేజీబీవీలలో 1,040 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో జిల్లాలోని 11 కేజీబీవీలు ఆదోని జనరల్, చిప్పగిరి, దేవనకొండ, గోనెగండ్ల, గూడూరు, హాలహర్వి, కౌతాళం, మద్దికెర, నందవరం, వెల్దుర్తి, పెద్దకడుబూరులలో ఎంపీసీ గ్రూపులు నిర్వహిస్తున్నామని, వీటిలో ప్రతి కేజీబీవీకి 40 చొప్పున మొత్తం 440 సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. జిల్లాలోని ఆలూరు, ఆస్పరి, బెళగల్, హొళగుంద, కోడుమూరు, క్రిష్ణగిరి, తుగ్గలి కేజీబీవీలలో బైపీసీ గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ఒక్కొక్క కేజీబీవీలో 40 సీట్ల చొప్పున మొత్తం 360 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎమ్మిగనూరు, ఓర్వకల్లు కేజీబీవీలో ఎంఈసీ గ్రూపు, ఆదోని (మైనార్టీ) రిటైల్ మేనేజ్మెంటు గ్రూపులో 40 సీట్లు, కల్లూరు మైనార్టీలో సీఎస్‌సీ గ్రూపులో 40 సీట్లు, కోసిగిలో పీఎస్‌టీటీ గ్రూపులో 40 సీట్లు, కర్నూలు కేజీబీవీలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపులో 40 సీట్లు, మంత్రాలయం కేజీబీవీ ఎంఎల్‌టీ గ్రూపులో 40 సీట్లు కేటాయించామన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు పతక సంచాలకులు విజయజ్యోతి కుమారి తెలిపారు.

మహానందిలో పూర్ణాహుతి

- ముగిసిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- రుద్రగుండం కోనేరులో ఉత్సవ మూర్తులకు త్రిశూల స్నానం
- మహానందిలో ధ్వజారోహణం చేసిన వేదపండితులు
- నంద్యాలకు బయలుదేరిన పెళ్లి పెద్ద బ్రహ్మనందీశ్వరుడు


మహానందిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

మహానంది, మార్చి 11: మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ముందుగా ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలతోపాటు పెళ్ళి పెద్దగా వ్యవహరించిన బ్రహ్మనందీశ్వరుడు, గంగాదేవి ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో రుద్రగుండం కోనేరు వద్దకు తీసుకొచ్చి వైభవంగా త్రిశూల స్నానం చేశారు. దీంతో రుద్రగుండం కోనేరు వివిధ రంగులతో నిండిపోయింది. అనంతరం ధ్వజ స్తంభం వద్ద అర్చకులు ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సుధారాణి దంపతుల చేత ధ్వజారోహణం చేయించారు. ఆలయం ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో నాగవల్లి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతోపాటు నూతన వస్త్రాలను యాగశాలలోని హోమంలో సమర్పించి, పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదమంత్రాలతో నిర్వహించారు. దీంతో మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో కురగాయాల దాత లక్కబోయిన ప్రసాద్, ఏఈఓలు మధు, వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రంగన్న, నాగభూషణంలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

'సమస్యలు పరిష్కరించాలి'


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యానగర్ కాలనీ వాసులు

నందికొట్కూరు, మార్చి 11: పట్టణంలోని విద్యానగర్‌లో సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు టీడీపీ ముస్లిం, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ సుధాకర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. షకీల్ అహ్మద్ మాట్లాడుతూ ఇటీవల భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించిన సమయంలో విద్యానగర్ కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అందులో ప్రధానంగా కాలనీలో మురుగునీరు ప్రవహించేందుకు కాలువలు లేకపోవడంతో ఎక్కడిక్కడ మురుగు నీరు నిలిచి పోయి దోమలు వ్యాపించడంతో రోగాల బారి పడుతున్నట్లు కాలనీ వాసులు తెలిపారన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు డ్రైనేజీలను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రసూల్ ఖాన్, మహిళలు పాల్గొన్నారు.

'హామీని సీఎం జగన్ నిలబెట్టుకోవాలి'


బైకు ర్యాలీ నిర్వహిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

నంద్యాల టౌన్, మార్చి 11: రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బాధితుల సంఘం, వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అగ్రిగోల్డ్ బాధితులు నంద్యాల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి శ్రీనివాససెంటర్ వరకు ర్యాలీ జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, అగ్రి గోల్డ్ బాధితుల సంఘం నాయకులు రూబెన్, బాబాఫక్రుద్దీన్, వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.ప్రసాద్, సోమన్న, శ్రీనివాసులు, తదితరులు మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిపాజిట్ల డబ్బులు ఇవ్వాలని, చనిపోయిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే డిపాజిట్ డబ్బులు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

'అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి'


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు

గోస్పాడు, మార్చి 11: ఉపాధ్యాయులు చాలా కాలంగా ఎదురు చూస్తున్న అంతర్ జిల్లా బదిలీలను చేపట్టాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. గోస్పాడులో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రాకమునుపే ఈ ప్రక్రియ చేపట్టాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు ఆర్డర్ సీఎస్‌సీ నుంచి మాత్రమే ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డులు అన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిల్లో అంగీకరించాలని, ఈఎల్ఎస్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సురేష్‌శర్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నివాళి


నివాళి అర్పిస్తున్న జయసూర్య తదితరులు

జూపాడుబంగ్లా, మార్చి 11: నంద్యాల జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది తండ్రి రామచంద్రుడు ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. పారుమంచాల గ్రామంలోని ఇంటి వద్దకు వెళ్లి టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, సీపీఐ జిల్లా నాయకులు రమేష్‌బాబు, నందికొట్కూరు విద్యార్థి జేఏసీ నాయకులు నివాళి అర్పించారు. కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

నంద్యాల (కల్చరల్), మార్చి 11: కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం సాయంత్రం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉమెన్స్ డే వేడుకలకు నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఐసీడీఎస్ పీడీ నిర్మల, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ డా.శశికళ, ఐఎంఏ ప్రెసిడెంట్ డా.రాణి, సెక్రటరీ మాధవి, డాక్టర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

పాములపాడు, మార్చి 11: మండలంలోని క్రిష్ణనగర్ గ్రామంలో కరెంటు తీగలు తగలడంతో గడ్డివాములు కాలిపోయాయి. గ్రామానికి చెందిన రైతు చింతకుంట వెంకటేశ్వర్లు, రాణెమ్మకు చెందిన ఐదు ఎకరాలకు చెందిన గ్రాసాన్ని రెండు గడ్డి వాములుగా ఏర్పాటు చేశారు. అయితే సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి గడ్డి వాముల మీద పడటంతో కాలిపోయాయి. దాదాపు రూ. 50 వేలు విలువ చేసే పశుగ్రాసం కాలి బూడిదయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ


చిన్నదేవళాపురంలో పథకాల గురించి వివరిస్తున్ననాయకులు


ఇందిరేశ్వరంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు, మార్చి 11: పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు అన్నారు. మండలంలోని చిన్నదేవళాపురం 154వ బూత్ ఇన్‌చార్జ్ మహేశ్ తారక్ ఆధ్వర్యంలో సోమవారం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను తెలియజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు 50 సంవత్సరాలకే రూ.4వేలు పింఛన్, అన్ని రకాల పింఛన్‌దారులకు సైతం ఒకేసారి రూ.4వేలు పింఛన్ ఇస్తారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకో జగన్‌ను ఇంటికి సాగనంపాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: టీడీపీ ప్రవేశ పెట్టబోయే మహాశక్తి పథకాలతోనే మహిళా సంక్షేమం సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసులు, నబిసాహెబ్ అన్నారు. మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న
కలెక్టర్, జేసీ, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

నంద్యాల క్రైం, మార్చి 11: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 14న నంద్యాల జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కె.శ్రీనివాసులు, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సభాస్థలి, పార్కింగ్, హెలిప్యాడ్, హాస్పిటల్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. బనగానపల్లెలో వంద పడకల ఆస్పత్రిని సీఎం ఈ నెల 14న ప్రారంభించనున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ సీఎం సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేలా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రయాణికులు, వాహన దారులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయా శాఖ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. బందోబస్తు నిమిత్తం వచ్చే పోలీస్ అధికారులు, సిబ్బందికి వసతి సౌకర్యం కల్పించాలన్నారు. అనం తరం వారు పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పలువురు జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎద్దుల పోటీలు

మహానంది, మార్చి 11: మహానందిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పాల పండ్ల సైజు 6-6 రకం విభాగం పోటీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా పుచ్చకాయాల శేషాద్రి చౌదరికి చెందిన ఎద్దులు 3300 అడుగుల దూరం లాగి మొదటి సాంజతనం దక్కించుకొన్నట్లు మండల రైతు కమిటీ సభ్యుడు కందుల రఘురామిరెడ్డి తెలిపారు. పాణ్యం మండలం ఎస్ కొతూర్తుకు చెందిన బీరం మస్తాన్‌రెడ్డి ఎద్దులు 3120 అడుగుల దూరం లాగి కైవసం చేసుకున్నట్లు తెలిపారు. మూడో స్థానాన్ని ఎంఎస్ఆర్ బుల్స్ ప్రకాశం జిల్లా ఉమ్మారెడ్డి శ్రీవల్లి(గంగన్నపాలెం)కు చెందిన ఎద్దులు 3 వేల అడుగుల దూరం లాగాయి. నాల్గవ స్థానాన్ని బీరం బుల్స్ పాణం మండలం ఎస్ కొతూర్తుకు చెందిన సుబ్రమాణేశ్వరరెడ్డి వృషభాలు 2823.5 అంగుళాలు, ఐదవ బహుమతిని కృష్ణా జిల్లా మల్లపల్లికి చెందిన ఎం.సత్యచౌదరి వృషభాలు 2155 అడుగుల దూరం లాగి దక్కించుకున్నట్లు తెలిపారు. విజేతలైన ఎడ్ల యజమానులకు క్రీడా మైదానంలో రైతు కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. దీంతో మహానందిలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ముగిశాయి.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీకి యత్నం

పాణ్యం, మార్చి, 11: పాణ్యంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి ప్రయత్నించినట్లు అంగన్‌వాడీ కార్యకర్త మాబున్నీసా తెలిపారు. సోమవారం ఉదయం కేంద్రానికి వెళ్లిన ఆమె అక్కడ రాళ్లు, విద్యుత్ తీగలు తెగడం, బండలు పగులగొట్టడం గమనించినట్లు తెలిపారు. కేంద్రానికి వేసిన తాళం పగులగొట్టడానికి ప్రయత్నించి విఫలమైనట్లు తెలిపారు. దీంతో వెంటనే సీడీపీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఇటీవల కేంద్రానికి ప్రహరీని తొలగించడంతో దొంగలు, మందుబాబులకు కేంద్రం అడ్డాగా మారినట్లు తెలిపారు.

మాల మహానాడు కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ఆత్మకూరు రూరల్, మార్చి 11: ఆత్మకూరు పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు మల్లె ఎలీషా, ప్రాత కోట రమేష్‌ల ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు మాల మహానాడు శ్రీశైల నియోజకవర్గ కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నియోజకవర్గ అధ్యక్షుడిగా పెరుమాళ్ళ చింతలయ్య, గౌరవ సలహాదారుగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా చెన్న కేశవులు, అబ్రహం, చెన్నయ్య, భీమార్జున, ప్రధాన కార్యదర్శిగా ప్రాత కోట భాస్కర్, మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా సంపత్, చంద్రశేఖర్, జయరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాజగోపాల్, నాగన్న, జయన్న, కేశాలు, కార్యవర్గ సభ్యులుగా వరమయ్య, శేషన్న, జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బయటపెట్టాలి'



ఆత్మకూరు: ఎస్‌బీఐ మేనేజర్‌కు
వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, మార్చి 11: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బయట పెట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఎదుట సోమవారం ధర్నా చేశారు. సోమవారం నాయకులు లక్ష్మణ్, రమేష్‌కుమార్, పుల్లా నరసింహులు, రాజశేఖర్ మాట్లాడుతూ ఎలక్ట్రోల్ బాండ్లు ఎవరి వద్ద నుంచి తీసుకున్నారు, ఎవరికి ఇచ్చారు, తదితర వివరాలను బయట పెట్టాలని ఎస్‌బీఐని సుప్రీం కోర్టు ఆదేశిస్తూ 16 రోజులు గడువు విధిస్తే ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, నరసింహనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ కార్యాలయం నందు ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ పవన్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మాబాషా, స్వాములు, రామ్‌నాయక్, షేక్ ఇస్మాయిల్, వీరన్న, కిరణ్, సత్యనారాయణ, నబి, నూర్ ఉన్నారు.

నందికొట్కూరు: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బయటపెట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ తీరుపై సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, రూరల్ కార్యదర్శి నాగన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్, జిల్లా నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), మార్చి 11: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు సత్వర పరిష్కార మార్గాలు చూపేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వైఎస్సార్ సెంటనరీ హాల్లో స్పందన కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్వో పద్మజ, ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ స్పందన విజ్ఞప్తులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందనలో 111 దరఖాస్తులు రాగా వాటన్నింటిని విథిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు


నంద్యాలలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

నంద్యాల క్రైం, మార్చి 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛాయుత ఓటింగ్‌ను కాంక్షిస్తూ నంద్యాల పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. బీఎస్ఎఫ్ డీఎస్పీ అజయ్‌కుమార్, నంద్యాల టూ టౌన్ సీఐ రాజారెడ్డి, తాలుకా సీఐ దస్తగిరిబాబు, వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల పట్టణంలో 100మంది బీఎస్ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. జిల్లా ప్రజలకు ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత ఓటింగ్‌పై భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో ర్యాలీ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ర్యాలీ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ, నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి, సాయిబాబానగర్, టెక్కె, పద్మావతినగర్ మీదుగా మున్సిపల్ ఆఫీస్ వరకు సాగింది. పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంతవాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడటమే కవాతు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడానికి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే ధ్యేయమని వారు పేర్కొన్నారు.

నంద్యాల రూరల్: కేంద్ర సరిహద్దు బలగాలు నంద్యాల మండలంలో కవాతు నిర్వహించాయి. మండలంలోని అయ్యలూరు గ్రామంలో సోమవారం జరిగిన ఈ కవాతులో కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీస్ బలగాలు పాల్గొన్నాయి. నంద్యాల తాలుకా యూపీఎస్ సీఐ దస్తగిరి కవాతుకు నేతృత్వం వహించారు. కవాతు సందర్భంగా బలగాలు గ్రామంలోని పలు వీధుల్లో మార్చ్ ఫాస్ట్ చేశాయి.

ఆత్మకూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సిద్దాపురం, పెద్దఅనంతాపురం గ్రామాల్లో సోమవారం అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తామని ప్రజలకు భరోసా కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా బీఎస్ఎఫ్ బలగాలను రంగంలోకి దించినట్లు చెప్పారు. ఆత్మకూరు రూరల్, అర్బన్ సీఐలు నాగభూషణ్, లక్ష్మీనారాయణ, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు ఎస్ఐలు నారాయణరెడ్డి, హరిప్రసాద్, అశోక్ ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


ఉత్సవ విగ్రహాలకు స్నానం చేయిస్తున్న భక్తులు

గడివేముల, మార్చి 11: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని దుర్గాభోగేశ్వర ఆలయంలో సోమవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పారువేటతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ దుర్గాభోగేశ్వరులకు తిరుమంజనం, నాకబలి నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ పురవీధుల్లో ఊరేగించి పంచకోనేర్లలో అవభృద స్నానం చేయించారు. వసంతోత్సవం సందర్భంగా భక్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. సాయంత్రం పారువేట నిర్వహించి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గడిగరేవుల గ్రామానికి చేర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు

గడివేముల, మార్చి 11: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో సోమవారం ఆలయ పర్యవేక్షణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సునీల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. భక్తులు హుండీలో వేసిన ముడుపులను లెక్కించగా రూ.2,14,975, స్వామి వారి కల్యాణంలో భక్తులు చదివించిన ముడుపులు రూ.36,696, టికెట్ కలెక్షన్ రూ.87,760, తాత్కాలిక షాపు కలెక్షన్ రూ.25,300 వచ్చిందని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.66,369 ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సీఎఫ్‌వో సంపత్‌కుమార్, హుండీ పర్యవేక్షణాధికారి గోపి, ధర్మకర్తలు శివుడు, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో దళితులకు అన్యాయం'


టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

నంద్యాల రూరల్, మార్చి 11: వైసీపీ పాలనలో దళితులకు అన్యాయం జరిగిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది తులసీరెడ్డి ఆరోపించారు. చాపిరేవుల గ్రామానికి చెందిన 80 దళిత కుటుంబాలు సోమవారం వైసీపీ వీడి టీడీపీలో చేరాయి. ఫరూక్, తులసీ రెడ్డిల మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులు నివసించే ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మండ్ల గుర్రప్ప, చింతల సుబ్బరాయుడు, జిల్లెల మధుసూదన్ రెడ్డి జనసేన నాయకులు అభిషేక్, చందు తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని ఊడుమల్పురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సోమవారం ఆ పార్టీని వీడి సైకిలెక్కారు. గ్రామంలోని శివమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ జ్వాలా తిరుమలేష్ ఆధ్వర్యంలో చేరారు. చేరికలో వైసీపీ నాయకులు జ్వాలా నాగంద్ర, కేశవ రెడ్డి, రాముతో పాటు పలు కుటుంబాలు తెదెపా తీర్థం పుచ్చుకున్నాయి. నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ వీరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

'చంద్రబాబుతోనే యువతకు న్యాయం'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 11: టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చంద్రబాబు నేతృత్వంలో పెద్దఎత్తున పరిశ్రమల స్థాపనకు టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాల పట్టణంలోని దేవనగర్, జగజ్జననీ నగర్, నందమూరినగర్, తదితర ప్రాంతాలకు చెందిన యువకులు ఉప్పరి సురేష్, ఉప్పరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 150 కుటుంబాలు ఎన్ఎండీ ఫిరోజ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. ఫిరోజ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, పూర్తిగా మొండి చెయ్యి చూపిన ఘనత ముఖ్యంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

అటల్ ఇన్నోవేషన్‌లో రామకృష్ణ కళాశాలకు అవార్డు

నంద్యాల టౌన్, మార్చి 11: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అటల్ ఇన్నోవేషన్ సెంటర్ విభాగంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించిన కళాశాలల్లో నంద్యాలకు చెందిన రామకృష్ణా విద్యాసంస్థలకు ప్రథమ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వ పథకానికి అనుసంధానంగా అనంతపురం శ్రీకృష్ణ దేవరాయల విశ్వవిద్యాలయంలో ఏఐసీ-ఎస్కేయూ అటల్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభమైంది. దీనికి అనుసంధానంగా ఏపీ తెలంగాణాలతో పాటు కర్ణాటక రాష్ట్రాలలోని 68 డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు ఏఐసీ -ఎస్కేయూతో ఒప్పందం చేసుకొని గతేడాది ఫ్యాకల్టీ ట్రైనింగ్ సెషన్స్‌ను నిర్వహించారు. ఈ ట్రైనింగ్‌లో విద్యార్థులను సృజనాత్మకత, సరికొత్త ఆలోచనలకు కావాల్సిన మౌలిక వసతులు ఏలా కల్పించాలన్న విషయంపై కార్యాచరణ అమలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎంవోయూ తీసుకొన్న కళాశాలల్లో ఏకోసిస్టమ్ ఇన్ ఎమర్జెన్స్ విభాగంలో రామకృష్ణా విద్యాసంస్థలకు ప్రథమ బహుమతి లభించింది. ఈనెల 9,10వ తేదీల్లో అనంతపురంలోని ఎస్కే యూనివర్సిటీలో ఎస్కేయూ స్టార్టప్ జాతా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ హుసేన్‌రెడ్డి, ఏఐసీ ఎస్కేయూ ఫౌండర్ చీఫ్‌లు రమణరామనాథం, నాగభూషన్‌రాజు, సీఈవో శివకిషోర్, తదితరులు రామకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డికి అవార్డు అందజేశారు. కళాశాల డైరెక్టర్ జి.హేమంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కేవీబీ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వేలంలో రూ.15.99 లక్షల ఆదాయం



యర్రగుంట్లలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల, మార్చి 11: మండలంలోని యర్రగుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని సంతమార్కెట్‌లలో 2024-25 సంవత్సరానికి గాను రుసుములు వసూలు చేసుకునే హక్కును పొందేందుకు నిర్వహించిన బహిరంగ వేలంపాటల ద్వారా రూ.15.99 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఇందులో వారపు సంతకు రూ.13.01 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.1.71 లక్షలు, కబేళాకు రూ.1.27 లక్షలు ఆదాయం వచ్చిందని చెప్పారు. 2023-24 సంవత్సరానికి గ్రామ పంచాయతీకి వీటి ద్వారా రూ.12.64 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.3.35 లక్షల ఆదాయం పెరిగి రూ.15.99 లక్షలు వచ్చిందన్నారు. ఈవోపీఆర్డీ నాగేంద్ర పర్యవేక్షణలో ఈ వేలం పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభహాన్ అలీ, ఉప సర్పంచ్ సత్తారు ప్రతాప్ రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

- మహదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వారపు సంత మార్కెట్‌కు నిర్వహించిన బహిరంగ వేలం పాట ద్వారా రూ.5.50 లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి వెంకట రమణ, సర్పంచ్ పెద్ది రమణయ్య సోమవారం తెలిపారు. గత ఏడాది రూ.7.02 లక్షలు రాగా ఈ ఏడాది రూ.1.52 లక్షల ఆదాయం తగ్గిందన్నారు. జూనియర్ అసిస్టెంట్ నవీన్ రెడ్డి, గ్రామ పెద్దలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్కెట్లకు వేలం పాటలు

రుద్రవరం, మార్చి 11: రుద్రవరం మేజరు పంచాయతీలో సోమవారం సాయంత్రం ఈవో సుబ్బారావు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో రూ.1.31 లక్షలు ఆదాయం వచ్చిందని చెప్పారు. దినసరి మార్కెట్ రూ.3.70 లక్షలు, వారపు సంత మార్కెట్ రూ.8.31 లక్షలు, కబేళా రూ.8 వేలు వేలం పాడారన్నారు. ఈ వేలంలో వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాకు జమ చేస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అరవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

14న బనగానపల్లెకు సీఎం రాక

బనగానపల్లె, మార్చి 11: బనగానపల్లె పట్టణంలో ఈనెల 14న రూ.22 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి సీఎం జగన్ వస్తున్న సందర్భంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో కలసి సోమవారం బనగానపల్లె పట్టణంలో సభా ఏర్పాట్లు పరిశీలించారు. పట్టణంలో సభాస్థలి, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయడానికి స్థలాన్ని సేకరించారు. హెలిప్యాడ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని, ప్రయాణికులు, వాహనదారుల మళ్లింపు తదితర వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బీసీలకు 50 ఏళ్లకే రూ.4 వేల పింఛన్

డోన్, మార్చి 11: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ వర్గాల ప్రజలకు 50 ఏళ్లకే రూ.4 వేల పింఛన్ ఇచ్చేలా చంద్రబాబు హామీ ఇచ్చారని డోన్ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేధిత అన్నారు. సోమవారం పట్టణంలో మాకం వీధిలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. చంద్రబాబు హయాంలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామిశెట్టి చైతన్య, రవి, అజీజ్, ఎన్‌ఈ సరోజ, సురేఖ పాల్గొన్నారు.

యాగంటిలో శివ దీక్ష విరమణ

బనగానపల్లె, మార్చి 11: మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివదీక్ష విరమణ కార్యక్రమం సోమవారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఇరుముడి ధరించి బనగానపల్లె, యాగంటిపల్లె, సాదుకొట్టం, మీరాపురం మెట్ట, పాతపాడుల మీదుగా పాదయాత్రగా బయల్దేరారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాతపాడు నుంచి యాగంటి వరకు పాదయాత్ర చేశారు. అధిక సంఖ్యలో భక్తులు యాగంటి క్షేత్రానికి చేరుకుని మండల, అర్ధమండల శివదీక్ష చేపట్టిన శివస్వాములు ఇరుముడిని తలపై పెట్టుకొని సాంప్రదాయబద్ధంగా పాతపాడు గ్రామం నుంచి కాలినడకన యాగంటి క్షేత్రానికి చేరుకొని యాగంటి దేవస్థానం ఆవరణంలో ఇరుముడిని విప్పి ఉమామహేశ్వరుల స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసానితోపాటు భక్తులు శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో వేద పండితుల మధ్య పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఉమామహేశ్వర, రెడ్ల, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల ఆధ్వర్యంలో ఉచిత భోజనం అందించారు. బనగానపల్లె సిఐ గంటా సుబ్బారావు, పోలీస్ సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ దొనపాటి యాగంటి రెడ్డి, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వారందరికీ న్యాయం

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన కౌన్సిలర్ సుధామణి, సుధాకరరెడ్డి

ఆళ్లగడ్డ, మార్చి 11: టీడీపీని నమ్ముకొని పార్టీలో చేరుతున్న వారందరికీ న్యాయం చేస్తామని, వారి నమ్మకాన్ని వమ్ము చేయబోమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ప్రభుత్వ జలవనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి స్వయాన అక్క కుమారుడు బద్రి సుధాకర్‌రెడ్డితో పాటు ఆయన భార్య ఆళ్లగడ్డ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ సుధామణి సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో ఆమె నివాసంలో చేరారు. వారికి అఖలప్రియ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీలో తమకు గుర్తింపు ఇవ్వకపోవడం, స్వయాన బంధువులైనా వారు పట్టించుకోవడం లేదని, దీంతో వైసీపీని వీడి టీడీపీలో చేరామని సుధాకర్‌రెడ్డి, సుధామణి చెప్పారు. కార్యక్రమంలో భార్గవ్‌రామ్‌నాయుడు, శ్రీనివాసరెడ్డి (వాసు), నీలకంఠేశ్వరరెడ్డి దంపతులు, పడకండ్ల, నాగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన కర్రా కుటుంబ సభ్యులు సోమవారం ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామ సర్పంచ్ బండి మరియమ్మ, ఎంపీటీసీ కర్రా రాధమ్మ, ఉప సర్పంచ్ మధుసూదన్, మాజీ సర్పంచ్ రామచంద్రుడు, కర్రా రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డితో పాటు గ్రామంలోని 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అఖిలప్రియ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, తాగునీటి సమస్యపై నిలదీస్తారన్న భయంతో ఎమ్మెల్యే ఇంటి నుంచి బయటికి రాలేకున్నారని విమర్శించారు. కర్రా కుటుంబ సభ్యులు టీడీపీలోకి రావడం సంతోషకరంగా ఉందని, వీరికి సముచిత స్థానం కల్పిస్తామని జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. నాయకులు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, కుడాల నారాయణరెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, గడ్డం దస్తగిరి రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ కార్మిక బీమా లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ దంపతులు

బనగానపల్లె, మార్చి 11: కార్మికులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయం ఆవరణలో కార్పెంటర్లు, గౌండాలు, తదితర వృత్తి పనుల వారి సంక్షేమం కోసం బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సొంత నిధులతో సోమవారం కార్మిక బీమా పథకాన్ని బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈట్రస్ట్‌కు అధ్యక్షురాలిగా బీసీ ఇందిరమ్మ వ్యవహరిస్తారన్నారు. కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగి కుటుంబ పెద్దను కోల్పోయినా, గాయపడ్డ వారి కుటుంబ పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. ఎంతో మంది కార్మికులు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఏదైనా ప్రమాదానికి గురైతే వెంటనే ఆర్థిక సాయం అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే బీసీ జెఆర్ ట్రస్ట్ కార్మికుల సంక్షేమం కోసం బీసీజేఆర్ ట్రస్ట్ తరపున రూ.25లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేసి బీమా ద్వారా ఆదుకుంటామన్నారు. గౌండా పనివారు, పాలిష్ కటింగ్ పనివారు, కార్పెంటర్లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, ఆటో మొబైల్ మెకానిక్‌లు, టైలర్లు వంటి వృత్తి పనులు చేసుకునే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే వైద్య పరీక్షల నిమిత్తం రూ.20 వేలు తక్షణ ఆర్థిక సాయం ట్రస్ట్ తరపున అందించనున్నట్లు తెలిపారు. దురదృష్టవశాత్తూ ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ బీసీ జనార్దన్‌రెడ్డి నిస్వార్థంలో రాజకీయాలకు అతీతంగా ఈబీమా పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ల కోసం బీసీజేఆర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆఫీసు సిబ్బంది మాధవరెడ్డి 917778235, దస్తగిరి 7680874408 సెల్ నంబర్లను సంప్రదించాలని బీసీ కోరారు. అంతేగాక మరో 4 వృత్తి పనుల వారికి కూడా అదనంగా కార్మిక బీమా వెల్డర్లు, హోటల్ కార్మికులు, కుమ్మరి కార్మికులు, ఫొటోగ్రాఫర్లకు కూడా ఈట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం వర్తిస్తుందన్నారు.

చందాలతో మసీదును నిర్మించుకున్నాం

- మంత్రి బుగ్గన పైసా ఇవ్వలేదు..
- యు.కొత్తపల్లి ముస్లిం మైనార్టీ నాయకులు



ఆందోళన చేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

డోన్, మార్చి 11: 'చందాలు వేసుకుని మసీదును నిర్మించుకున్నాం.. మంత్రి బుగ్గన పైసా నిధులు ఇవ్వలేదు.' అని సోమవారం డోన్ మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. మసీదు కమిటీ ప్రెసిడెంటు హనీఫ్ మాట్లాడుతూ యు.కొత్తపల్లి గ్రామంలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉందని, పాత మసీదును పడగొట్టి.. కొత్త మసీదును నిర్మించుకునేందుకు ముస్లిం కుటుంబాలు ముందుకు వచ్చాయన్నారు. ముస్లిం కుటుంబాల నుంచి చందాలు సేకరించామని, దుబాయిలో ఉన్న ఓ వ్యక్తి ఇచ్చిన ఆర్థిక సహకారంతో రూ.70 లక్షల వ్యయం చేసి మసీదును నిర్మించుకున్నామని తెలిపారు. అయితే.. వైసీపీ నాయకులు మసీదులో ఫొటోలు దిగి బుగ్గన చొరవతో మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారంటూ అధికార పార్టీకి అనుకూల పత్రికలో తప్పుడు వార్తలతో ప్రచారం చేసుకోవడం సమంజసం కాదన్నారు. మసీదు నిర్మాణానికి మంత్రి బుగ్గన పైసా నిధులు ఇవ్వలేదని చెప్పారు. ముస్లింల మధ్య గొడవలు పెట్టేలా తప్పుడు ప్రచారం చేసుకోవడం తగదన్నారు. మంత్రి బుగ్గన నిధులను ఏ రూపంలో ఇచ్చారో తెలపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎన్నికలో తమ గ్రామానికి వస్తే అడ్డుకుంటామని హనీఫ్ స్పష్టం చేశారు.

సైకో పాలనపై ప్రజల్లో తిరుగుబాటు

టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, మార్చి 11: సైకో సీఎం జగన్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు వచ్చిందని, ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైసీపీని ఇంటికి సాగనంపడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ డోన్ నియోజకవర్గ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా నిర్వహించిన సభలో కోట్ల మాట్లాడారు. ఒక్క చాన్స్‌తో సైకో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, మరో అవకాశం ఇస్తే ఏపీని ఎవరూ కాపాడలేరన్నారు. డోన్ నియోజకవర్గంలో కోట్ల, కేఈ కుటుంబాల సహకారంతోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. తన తండ్రి దివంగత కోట్ల విజయభాస్కరెడ్డి ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అలాగే కేఈ క్రిష్ణమూర్తి ఉప ముఖ్యమంత్రిగా నియోజకవర్గంలో తమ వంతు అభివృద్ధి చేసినట్లు ఈ సందర్భంగా కోట్ల చెప్పుకొచ్చారు. తమ దగ్గర డబ్బులు లేకున్న ప్రజాభిమానం ఉందని, అధికార పార్టీ ప్యాకేజీలు పంపిణీ చేసినా డోన్‌లో బుగ్గన ఓడటం ఖాయమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించి చంద్రబాబును సీఎంగా చేసుకుందామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, నాయకులు టిశ్రీనివాసులు, అలేబాదు పరమేష్, గండికోట రామసుబ్బయ్య, మాధవరం స్వామి, రామ్మోహన్ యాదవ్, చల్లా వీరాంజినేయులు, ఖాజాపీర్, గండికోట రమేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

ఆళ్లగడ్డ, మార్చి 11: మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు ఆళ్లగడ్డ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి, కోవెలకుంట్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి నెల రోజులు జైలు శిక్ష, రూ. 2వేలు చొప్పున జరిమానా విధించారని ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐలు వెంకటరెడ్డి, నగినా సోమవారం చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పాతబస్టాండులోఈ నెల 2, 8వ తేదీల్లో వాహనాల తనిఖీలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రుద్రవరం మండలం మందలూరు గ్రామానికి చెందిన చాణిక్యశర్మ, పట్టణానికి చెందిన చింతల సురేష్ మద్యం తాగి వాహనాలు నడిపినట్లు రుజువైందని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



భీమునిపాడులో కవాతు నిర్వహిస్తున్న సీఐ జయచంద్ర, పోలీసులు

కోవెలకుంట్ల, మార్చి 11: ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ జయచంద్ర సూచించారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంతోపాటు ప్యాక్షన్ గ్రామాలలో కేంద్ర బలగాలు సుమారు 100మంది పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జయచంద్ర మాట్లాడుతు ఆళ్లగడ్డ డీఎస్పీ షేక్ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ , ఆనంద్ సెంటర్, ముదిగేడు సర్కిల్, రంగరాజు పేట, సంతపేట , అమ్మవారిశాల వీధి, గాంధీ సెంటర్, బిజినవేముల, కంపమల్ల, భీమునిపాడు గ్రామాలలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ జీ చంద్రబాబు, ఎస్ఐ సురేష్ సూచించారు. వచ్చే ఎన్నికల దృష్ట్యా కేంద్ర సాయుధ బలగాలతో శిరివెళ్లలో సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు తమవంతు సహకారం అందించాలన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

కోవెలకుంట్ల, మార్చి 11: తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోవెలకుంట్ల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డంనాగేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు ఒక్క చాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. నవరత్నాల పేరుతో నవ మోసాలు చేస్తు పేద ప్రజల నడ్డి విరిచారన్నారు. ఇప్పటికే రాష్ట్రం అభివృద్ధిలో 20ఏళ్ళు వెనక్కి వెళ్ళిందన్నారు.

బీజేపీ సన్నాహక సభకు హాజరైన నాయకులు

డోన్(రూరల్), మార్చి 11: విజయవాడలో జరిగిన పార్టీ సన్నాహక కార్యక్రమానికి డోన్ నుంచి బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై విజయవాడలో జరిగిన సన్నాహక కార్యక్రమంలో పార్టీ పెద్దలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి డోన్ బీజేపీ నాయకులు శాలువతో సన్మానించారు.

కోట్లకు మద్దతు తెలిపిన కేశవయ్యగౌడు

డోన్, మార్చి 11: డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు కుటుంబ సభ్యులు మద్దతు తెలిపారు. సోమవారం పట్టణంలో మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు ఇంటికి కోట్ల వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని కుటుంబ సభ్యులంతా మద్దతు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను ఆపండి

కొలిమిగుండ్ల, మార్చి 11: కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామ పరిధిలో అక్రమ నిర్మాణాలను ఆపాలని సీపీఐ మండల నాయకుడు సూర్యనారయణ కోరారు. కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయంలో అక్రమ ఇళ్ల బేస్‌మట్టాల నిర్మాణాలపై తహసీల్దార్‌కు సీపీఐ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటిక్యాల పరిధిలో 738,112-ఎ సర్వే నెం బర్లలలో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు పోను మిగులు స్థలాలు కొందరు నాయకులు ఆక్రమించుకొని బేస్‌మట్టాలు వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం పట్టివేత

డోన్(రూరల్), మార్చి 11: పట్టణంతోపాటు వివిధ గ్రామాల్లో సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి మద్యం పట్టుకున్నారు. ఈ మేరకు డోన్ సెబ్ కార్యాలయంలో సెబ్ సీఐ జయనాథరెడ్డి, ఎస్ఐ సోమశేఖర్‌రావుతో కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ యాగంటి నుంచి తెలంగాణ నుంచి 150 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే డోన్ పట్టణం చిగురుమానుపేటకు చెందిన మౌలాలమ్మ నుంచి 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే పట్టణంలోని తారక రామనగర్‌కు చెందిన ఈడిగ మల్లికార్జున నుంచి వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ పోలీసులు తెలిపారు. ప్యాపిలి మండలం బావిపల్లె సుంకన్న నుంచి 30 సిల్వర్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

బనగానపల్లె, మార్చి 11: మండలంలోని ఇల్లూరు కొత్తపేట వద్ద రైలు ఢీకొని మహమ్మద్‌హుసేన్ (33) అక్కడికక్కడే మృతి చెందినట్లు నంద్యాల రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని బనగానపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి'



చాగలమర్రి, దొర్నిపాడులో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 11: రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న వైసీపీకి రోజుల దగ్గరపడ్డాయని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. సోమవారం 4వ ఎంపీటీసీ క్లస్టర్ పరిధిలో సూపర్-6 కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనకు ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.నాయకులు జెట్టి నాగరాజు, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షకీఫ్, వేణుగోపాల్‌రెడ్డి, మౌలాలి, అరీఫ్, మాబులాల్, అజీమ్, కరీముల్లా, గఫార్, శ్యాబుల్, అబ్దుల్‌ఖాదర్, రియాజ్, నాగూర్‌వలి, భాస్కర్, ఉసేన్‌బాషా, గాంధీ, ముల్లా రఫీ తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని 95వ బూత్ ఇన్‌చార్జి, 5వ వార్డు మెంబర్ తిరుమల వెంకట రవి అన్నారు. శిరివెళ్లలోని 95వ బూత్‌లో టీడీపీ సూపర్-6 మేనిఫెస్టో పత్రాలను సోమవారం ప్రజలకు అందజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

దొర్నిపాడు: వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ మండల కార్యదర్శి చలుంగారి అంకన్నయాదవ్, మాజీ సర్పంచ్ తులశమ్మ అన్నారు. సోమవారం దొర్నిపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి ఇంటింటికి వెళ్లి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దూదుకుల దస్తగిరి, మహబూబ్‌బాషా, నరసింహ, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతాం



ఎద్దుపెంటలో పర్యటిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్, మార్చి 11: రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే టీడీపీ అధినేత చంద్రబాబు ధ్యేయమని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర లేక తీరని అన్యాయం జరిగిందన్నారు. రైతుభరోసా కింద ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించేలా చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ఎందుకు ప్రకటించలేదో మంత్రి బుగ్గన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, శేషిరెడ్డి, శ్రీనివాసులు యాదవ్, దేవరబండ వెంకటనారాయణ, గోవిందు, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, మాజీ ఎంపీటీసీ మల్లేశ్వరయ్య, జయరాముడు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 11: చాగలమర్రి వాసవీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఉసేన్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పరీక్షలకు సంబంధించిన రికార్డులను, సీసీ కెమెరాలను పరిశీలించారు. రెండో సంవత్సరానికి చెందిన 259 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 45 మంది గైర్హాజరయ్యారని అన్నారు. సీఎస్ చిన్న వీరయ్య, డీవో అరుణకుమారి ఉన్నారు.

- బాలుర, సెయింట్ ఆన్స్‌లో పది పరీక్షా కేంద్రాలను సోమవారం ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. పది పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను పోలీసు స్టేషన్‌లో భద్రపరిచినట్లుతెలిపారు.

'నీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలి'

చాగలమర్రి, మార్చి 11: గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారంపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులచే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి సమస్య గ్రామాలను గుర్తించి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏవో రాజేంద్రప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి': మండలంలో రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసిన రైతులు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. సోమవారం చాగలమర్రిలోని మూడవ ఆర్‌బీకే కేంద్రంలో రైతులు, వ్యవసాయ సిబ్బందిచే సలహా మండలి సమావేశం నిర్వహించారు.

పొదుపు మహిళలకు చెక్కుల పంపిణీ

దొర్నిపాడు, మార్చి 11: మండలంలోని ఆయా గ్రామాల్లోని పొదుపు మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కులను సోమవారం మండలంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చెక్కును అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: సీఐ

బేతంచెర్ల, మార్చి 11: రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ హెచ్చరించారు. సోమవారం రాత్రి ఎంబాయి గ్రామంలో వారు సిబ్బందితో కలిసి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో వారు మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమస్యాత్మక గ్రామం ఎంబాయిలో గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై నిఘా ఉంచామని చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదైనా కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప, కానిస్టేబుళ్లు మద్దిలేటి, గురుబాబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆళ్లగడ్డ, మార్చి 11: పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసి యేషన్ ఆళ్లగడ్డ తాలుకా నూతన కార్యవర్గానికి సోమవారం ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి ఉయ్యాలవాడ ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు సోమవారం చెప్పారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో శ్యామలకు ఎనిమిది ఓట్లు, చంద్రమౌళికి పది ఓట్లు రావడంతో అధ్యక్షుడిగా చంద్రమౌళీ గెలిచినట్లు ప్రకటించామని చెప్పారు. మిగి లిన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికనట్లు తెలిపారు. ఉపాధ్య క్షుడిగా అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇదురుస్ బాషా, కోశాధికారిగా బసవరాజు, సహాయ కార్యదర్శిగా నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా అమరేశ్వర యాదవ్, అబ్దుల్ రవూఫ్, కో ఆప్టెడ్ సభ్యులుగా మహేంద్ర, సమత ఎన్నికైనట్లు తెలిపారు.

తిమ్మనపల్లెలో తాగు నీటి ఎద్దడి

రుద్రవరం, మార్చి 11: మండలంలోని తిమ్మనపల్లె గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. రెండు రోజుల నుంచి గ్రామానికి వాటర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ సోమవారం తెలిపారు. గ్రామంలో ఉన్న మంచినీటి పథకం బోరు బావిలో భూగర్భజలం అడుగంటింది. కొత్తబోరు వేయించడానికి పంచాయతీ తర్మానం చేశామన్నారు. అప్పటి వరకు వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీటి సమస్య లేకండా సరఫరా చేస్తున్నామని తెలిపారు.

'రోడ్డు భద్రత నియమాలు పాటించాలి'

రుద్రవరం, మార్చి 11: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం రుద్రవరంలో వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలను నడపకూడదన్నారు. వాహనాలు చిన్నపిల్లలకు ఇవ్వరాదని సూచించారు. లైసెన్సులు, హెల్మెట్లు తప్పనిసరగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: ఎంఈవో

చాగలమర్రి, మార్చి 11: పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో అనూరాధ సూచించారు. చాగలమర్రి కస్తూర్బా పాఠశాలను సందర్శించి పది విద్యార్థినుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. ఎస్‌వో సునీత ఉన్నారు.

'కాలువలు పూడిస్తే చర్యలు'

రుద్రవరం, మార్చి 11: గంగ కాలువలను పూడిస్తే చర్యలు తప్పవని తెలుగుగంగ ఏఈ నాగరాజు సోమవారంహెచ్చరించారు. మరీ ఇంత బరితెగింపా.. అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈ నెల 9న కథనం ప్రచురితమైంది. గంగ అధికారులు స్పందించారు. యల్లావత్తుల సమీపంలోని గంగ 16వ బ్లాక్‌ఛానెల్ ఉప కాలువను యథావిధిగా ఎక్సకవేటరుతో తవ్వించినట్లు ఏఈ తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడుకోవడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు.